

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

ఆర్థిక సంక్షోభం వల్లే పథకాల అమలు ఆలస్యం

- శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్
- నేటి బహిరంగ సభను విజయవంతం చేయాలి

వికారాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గతంలో పదేళ్ల పాలన చేసిన పెద్దలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నందున ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయలేక పోతున్నామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. అయినా ఒక్కొక్కటి అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గురువారం పట్టణంలోని స్పీకర్ నివాసంలో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో తులం బంగారంతో పాటు అన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. నేడు సాయంత్రం 4 గంటలకు ఎల్‌బీ స్టేడియంలో అఖిల భారత ప్రదేశ్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, నాయకులు, కార్యకర్తలతో సభ నిర్వహిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, ఇప్పటి వరకు ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల అప్పును వారసత్వంగా ఇచ్చిందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 2 లక్షల రుణ మాఫీ చేశామన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ దేశంలో ఎప్పుడూ జరగని విధంగా బహిరంగ సభ జరుగబోతుందన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ 10 సంవత్సరాలు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లిజాఫర్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, కిషన్ నాయక్, రత్నారెడ్డి, చిగుళ్లపల్లి రమేష్, మహిపాల్ రెడ్డి, నరోత్తం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహేశ్వరంలో గురువారం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కంపెనీ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచంతో పోటీపడేలా 30 వేల ఎకరాల విస్తీర్ణంలో అధునాతన నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సింగపూర్ లాంటి దేశాలకు చెందిన అత్యుత్తమ కన్సల్టెంట్స్‌తో చర్చిస్తున్నట్లు వివరించారు. పెట్టుబడులను ఆకర్షించే విధంగా అభివృద్ధి ఉంటుందన్నారు.



పరిశ్రమలో ప్రదర్శనకు ఉంచిన ఆభరణాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహానగరంలా మహేశ్వరం

30 వేల ఎకరాల్లో నిర్మాణం

- మనకు ప్రపంచంతోనే పోటీ
- ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళికలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ పరిశ్రమ ప్రారంభం
- సీఎంకు ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): త్వరలోనే మహేశ్వరం మహానగరంగా మారనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో గురువారం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కంపెనీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ పరిశ్రమలో తయారు చేసిన ఆభరణాలను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి పరిశీలించారు. వీరి వెంట ఐఏఎస్ సంజయ్‌కుమార్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్, ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్‌వో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏకే నిషాద్ ఉన్నారు. కంపెనీలో తయారు చేసిన పలు రకాల బంగారు నగలను చైర్మన్ ముఖ్యమంత్రికి చూపించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ మహేశ్వరం ప్రాంతాన్ని నాలుగో నగరంగా, భారత్ ఫ్యూచర్ సిటీగా మార్చేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఒకప్పుడు కులీ కుతుబ్‌షా హైదరాబాద్ నగరాన్ని నిర్మిస్తే.. ఆ తర్వాత నిజాం నవాబులు హైదరాబాద్, సికింద్రాబాద్‌లను నిర్మించారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సైబరాబాద్‌ను నిర్మించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో...



మలబార్ గోల్డ్ కంపెనీ ప్రారంభోత్సవంలో ప్రతినిధులు

సీఎంకు గజమాలతో ఘన స్వాగతం

మలబార్ గోల్డ్ పరిశ్రమను ప్రారంభించేందుకు మహేశ్వరం వచ్చిన సీఎం రేవంత్‌డ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను తుక్కుగూడలో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు సీఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికలు ఏవైనా విజయం మనదే కావాలని పిలుపునిచ్చారు. మహేశ్వరంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, అందుకోసం తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో పార్టీ సీనియర్ నేతలు ఏనుగు జంగారెడ్డి, కప్పాటి పాండు రంగారెడ్డి, నడికూడ శివ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి నోచని మల్కాజిగిరి

- సహకరించని స్థానిక నేతలు : ఎమ్మెల్యే మర్రి

మేడ్చల్, జూలై 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేవుడు వరమిచ్చినా... పూజారి కనుకరించలేదన్న చందంగా మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి పరిస్థితి ఉందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నా స్థానికంగా సహకారం అందడం లేదన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా భూ కబ్జాలే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా స్థానిక అధికారులు దానిని పాటించడం లేదని ఆయన అధికారుల తీరుపై మండిపడ్డారు. గురువారం ఈ మేరకు ఆయన స్థానిక నేతలతో కలిసి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో డంపింగ్‌యార్డులు, శ్మశానవాటికల సమస్యలున్నాయన్నారు. యూపీఎస్‌సీ నిర్మాణం కోసం 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు మంజూరైనా భూమి కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తనకు పీఏను కూడా కేటాయించలేదన్నారు.



6

బిల్లులు ఇప్పించండి మహాప్రభో!

పాఠశాలకు తాళం వేసి నిరసన

తాండూరుకు కొత్తగా ఆరు సబ్‌స్టేషన్లు

తాండూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పవర్ లోడ్‌ని తగ్గించేందుకు విద్యుత్ శాఖ కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేసింది. తాండూరు ప్రాంతంలో పలు సబ్‌స్టేషన్లపై అధిక లోడ్ ఉన్నందున ఫీడర్ల వారీగా కొత్తగా సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రతిపాదనలను పంపించారు. దీంతో సౌథరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ తెలంగాణ శాఖ అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. యాలాల మండలం హాజీపూర్‌లో 33/11 కేవీ సబ్ స్టేషన్, పెద్దేముల్ మండలం పాషాపూర్, కొండాపూర్‌లో 33/11 కేవీ సబ్ స్టేషన్, తాండూరు పట్టణానికి సంబంధించి చెనెగేష్‌పూర్, తాండూరు మండలం నారాయణపూర్, బెల్కటూర్‌లలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ నిర్ణయించింది. ఇందుకు భూమిని కేటాయించాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ కలెక్టర్‌కు లేఖను పంపారు.



పరిగి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

తాగునీరు ఇవ్వండి సారూ..

- బర్కత్‌పల్లిలో ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన..
- ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత

పరిగి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్కత్‌పల్లి గ్రామంలో వారం, పది రోజులుగా తాగునీటి సరఫరా కావడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ, గురువారం గ్రామంలోని చౌరస్తాలో మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులంతా పరిగి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోనూ ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. రెండు వారాలుగా తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు మండి పడ్డారు. గ్రామ కార్యదర్శి, అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాగునీటి సరఫరా గురించి అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా లాభం లేకపోయిందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు.

నేడు కొడంగల్‌కు డీజీపీ రాక

కొడంగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల భూమి పూజల్లో పాల్గొనేందుకు డీజీపీ జితేందర్, మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్ ఐపీఎస్, ఐజీ తఫ్సీర్ ఇక్బాల్ శుక్రవారం కొడంగల్‌కు రానున్నారు. ఉన్నతాధికారుల రాక నేపథ్యంలో గురువారం ఎస్పీ నారాయణరెడ్డి, స్థానిక సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ.సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. కొడంగల్ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం, దుద్యాల, బొంరాస్‌పేట్ పీఎస్ భవనాల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు సీఐ తెలిపారు. ఉన్నతాధికారులతో పాటు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి హాజరుకానున్నారు. అలాగే కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులు తదితరులు హాజరుకానున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లలితాదేవి

వైద్యులు సమయపాలన పాటించాలి

- జిల్లా వైద్యాధికారి లలితాదేవి

వికారాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో సేవలు మెరుగుపర్చాలని జిల్లా వైద్యాధికారి లలితాదేవి సూచించారు. గురువారం పట్టణంలోని ఐడీవోసీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీల్లో నిత్యం అవుట్ పేషెంట్ సేవలు 80 నుంచి 100 వరకు ఉండేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం గర్భిణులకు పరీక్షలు, మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం, ప్రతీ గురువారం అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమం విధిగా నిర్వహించాలన్నారు. అలాగే ప్రతీ శనివారం పాఠశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 40 సంవత్సరాలు పైబడిన మహిళల్లో కేన్సర్ నివారణ, నియంత్రణలో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. ప్రతీ నెల 9వ తేదీన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద గర్భిణులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితా దేవి చన్‌గోముల్, పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, మన్నెగూడ ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అనర్హుల రేషన్ కార్డు తొలగింపు!

- జిల్లాలో 1,145 రేషన్ కార్డులు గుర్తింపు
- బియ్యం పంపిణీ నిలిపివేతకు ఆదేశాలు

వికారాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అనర్హుల రేషన్ కార్డులు ఏరివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. గత ఆరు నెలలుగా రేషన్ బియ్యం తీసుకోని లబ్ధిదారులను గుర్తించి క్షేత్ర స్థాయిలో విచారణ జరపాలని పౌర సరఫరాలశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. విచారణలో అనర్హులుగా గుర్తించిన కార్డుదారులకు వెంటనే బియ్యం పంపిణీ నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. జిల్లాలో 2,290 మంది కార్డుదారులు ఆరు నెలలుగా రేషన్ తీసుకోనట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరిగి విచారణ నిర్వహించారు. జిల్లాలో మొత్తం కార్డులు 2,51,097 ఉన్నాయి.



క్షేత్ర స్థాయిలో విచారణ


సాంకేతికత ఆధారంగా ఒకే ఆధార్ నంబర్ కలిగిన లబ్ధిదారులు కొందరు రెండు చోట్ల రేషన్ తీసుకుంటున్నట్లు అధికారులు తమ విచారణలో గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారితో పాటు వంద సంవత్సరాలు దాటిన వారు, మృతి చెందిన వారు గత ఆరు నెలలుగా రేషన్ బియ్యం తీసుకోని వారిని అనుమానితులుగా భావించి జిల్లాలో అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఇప్పటి వరకు జిల్లా క్షేత్రస్థాయిలో నిర్వహించిన రేషన్ కార్డుల విచారణలో అధికారులు 1,145 రేషన్‌కార్డులను అనర్హమైనవిగా గుర్తించారు. ఇంకా 186 రేషన్ కార్డులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేయాల్సి ఉంది.



ఏసీబీ గుబులు!

వణికిపోతున్న ప్రభుత్వ అధికారులు!

వికారాబాద్ ఆర్టీవో కార్యాలయం



- ఆర్టీవో కార్యాలయ ఆవరణలో దుకాణాల మూసివేత
- కార్యాలయంలోకి మధ్యవర్తులకు నో ఎంట్రీ..
- అన్ని శాఖల్లోనూ అదే పరిస్థితి
- ఆర్నెళ్ల వ్యవధిలో పట్టుబడిన ముగ్గురు అధికారులు



మూసి ఉన్న జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్లు

వికారాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు ఏసీబీ పేరు వింటేనే వణికిపోతున్నారు. జిల్లాపై నిఘా ఉందన్న సమాచారంతో అవినీతి దూరంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వికారాబాద్ ఆర్టీవో కార్యాలయంలో మధ్యవర్తులదే రాజ్యంగా ఉండేది. ప్రస్తుతం వారిని సైతం ఏసీబీ గుబులు పట్టుకుంది. దీంతో కార్యాలయం ఎదుట ఉన్న జిరాక్స్ దుకాణాలతో పాటు ఆన్‌లైన్ సెంటర్లను మూసి వేశారు. కార్యాలయంలోకి సైతం ఎవరూ బ్రోకర్లు రాకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఎప్పుడు కళకళలాడే ఆర్టీవో కార్యాలయం నిర్మానుష్యంగా దర్శనమిస్తోంది. ఏసీబీ రైడ్ జరిగే అవకాశం ఉన్నందున్న తాము కార్యాలయం వైపు వెళ్లడం లేదని పలువురు బ్రోకర్లు చెబుతుండటం గమనార్హం. కాగా, గత ఆర్నెళ్ల కాలంలో

మిగతా 8వ పేజీలో...

నూతన డీసీఎస్‌వోగా సుదర్శన్

డీసీఎస్‌వో మోహన్‌బాబు బదిలీ



వికారాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డీసీఎస్‌వో) మోహన్‌బాబు బదిలీ అయ్యారు. డీసీఎస్‌వోగా గడిచిన పది నెలల పాటు జిల్లాలో విధులు నిర్వహించిన ఆయనను సూర్యాపేట జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నారాయణపేట డీసీఎస్‌వోగా పనిచేసిన సుదర్శన్ జిల్లాకు రానున్నారు. జిల్లాలో రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం చేరవేయడం, ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, పౌర సరఫరాల శాఖ డీఎం కృష్ణమోహన్‌లతో కలిసి ఆయన పని చేశారు. అలాగే ఆయన జిల్లాలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల దరఖాస్తులతో పాటు ఇతర సమస్యలు సైతం చాలా వరకు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నారు.

మహానగరంలా మహేశ్వరం

(ఐదో పేజీ తరువాయి)

మహేశ్వరం నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ప్రపంచానికి అందించబోతుందని చెప్పారు. ప్రపంచంతోనే పోటీపడేలా అధునాతన నగరాన్ని నిర్మిస్తున్నామన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ముచ్చర్ల బేగరకంచెలో ఓ గొప్ప నగరాన్ని నిర్మించేందుకు సింగాపూర్, తదితర దేశాలకు సంబంధించిన కన్సల్టెంట్స్‌తో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన మలబార్ జెమ్స్ అండ్ జ్యువెల్లరీ తయారీ యూనిట్ మహేశ్వరం ప్రాంతానికి రావడం సంతోషంగా ఉందన్నారు.

3.45 లక్షల చదరపు అడుగుల్లో..

మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహమ్మద్ మాట్లాడుతూ మహేశ్వరంలో 3.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,750మందికిపైగా కళాప్రావీణ్యం కలిగిన స్వర్ణకారులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అభివృద్ధి కలిగిన ఈ యూనిట్ ప్రపంచ వ్యాప్తంగా రిటైల్ విస్తరణకు దోహదం చేస్తుందన్నారు. అనంతరం ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్‌వో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 22 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌ను విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏకే నిషాద్ మాట్లాడుతూ తమ కంపెనీ తయారీ యూనిట్‌లో అధునాతన ఆర్అండ్‌డీ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. యూఎస్ఏ, జర్మనీ, ఇటలీ, టర్కీ నుంచి దిగుమతి చేసుకున్న యంత్రాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలం కబ్జా!

● **3,878 గజాలు అక్రమంగా అమ్మకం**

ఘట్‌కేసర్ రూరల్, జూలై3(ఆంధ్రజ్యోతి): లేఅవుట్లలో పార్కు, ఆట, స్కూల్, కమ్యూనిటీ భవనాల కోసం వదిలిన స్థలాలు కబ్జాల పాలవుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ పరిధిలోని సర్వే నంబర్లు 303, 304, 305, 306, 307లలో 43ఎకరాలను 1969లో 2001లో వినూత్న హైట్స్ పేరుతో 530 ప్లాట్లు చేసి విక్రయించారు. లేఅవుట్ నిబంధనల మేరకు పార్కు, స్కూల్, కమ్యూనిటీ హాళ్లకు 3,878గజాల స్థలాన్ని వదిలారు. 25సంవత్సరాల తర్వాత ఈ లేఅవుట్‌లోని ఖాళీ స్థలాలకు వెంచర్ నిర్వాహకులు సురేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు హద్దులుపాతి విక్రయించుకుంటున్నారు. మునిసిపాలిటీ స్థలాన్ని విక్రయిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా ఈ స్థలాన్ని వెంచర్ నిర్వాహకులే తిరిగి ప్లాట్లుగా అమ్మేస్తున్నారని, అధికారులు ఇప్పటికైనా దీనిపై చర్యలు తీసుకోవాలని కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అవుశాపూర్ మాజీ సర్పంచ్ ఐలయ్యాయాదవ్ అధికారులను కోరారు.



వినూత్న హైట్స్ అలేవుట్ స్థలంలో పాతిన హద్దురాళ్లు



పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న పాపయ్య

బిల్లులు ఇప్పించండి మహాప్రభో!

పాఠశాలకు తాళం వేసి నిరసన

మర్పల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన బిల్లులు మంజూరు కాలేదని పాఠశాల మాజీ ఛైర్మన్ పాపయ్య గురువారం ఆ స్కూల్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని కొత్లపూరం గ్రామానికి చెందిన ఎస్ఎంసీ ఛైర్మన్ పరిగి పాపయ్య బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా తరగతి గదుల నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు, తాగునీటి సౌకర్యం తదితర పనులు చేయించాడు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా అప్పు చేసి పనులు పూర్తి చేశాడు. అధికారులు రూ. 4.05 లక్షలు ఖర్చు అయినట్లు ఎంబీ రికార్డు చేశారు. కానీ ఏళ్లు గడుస్తున్నా బిల్లులు మాత్రం రావడం లేదు. దీంతో విసుగుచెందిన పాపయ్య గురువారం పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న ఎంఈవో పోలీసులతో అక్కడికి చేరుకొని ఆయనను సముదాయించారు. గతేడాది పాఠశాలకు తాళం వేస్తే ఇదే మాదిరిగా నెల రోజుల్లో బిల్లులు ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు పాపయ్య గుర్తు చేశాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో పోలీసులు పాపయ్యను అదుపులోకి తీసుకొని మర్పల్లి స్టేషన్‌కు తరలించారు. అనంతరం నచ్చజెప్పి పంపినట్లు తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జేడీ రాజేందర్‌సింగ్

లక్ష్య సాధనతో అభ్యసించాలి

దౌల్తాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనతో చదవాలని ఉన్నత విద్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్‌సింగ్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ జిల్లాపరిషత్ పాఠశాలలో ప్రేరణ తరగతులకు ఆయనహాజరై మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కుదూరంగా ఉండాలని ఉండాలని, తల్లిదండ్రుల ఆశయ సాధనకు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఒక వ్యక్తి వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలో వారి ఉన్నతికి దోహదం చేస్తుందన్నారు.

సదుపాయాల కల్పనకు కృషి

కళాశాల అభివృద్ధి, విద్యార్థులకు సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. దౌల్తాబాద్‌లోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. కళాశాలలో బోధనకు 12మంది అధ్యాపకులను నియమించినట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ డిగ్రీ కళాశాలల సంయుక్త కార్యదర్శి డాక్టర్ రాజేందర్‌సింగ్ మాట్లాడుతూ... ప్రభుత్వ కాలేజీల్లో చదివిన విద్యార్థులు ఎంతో మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీహరిరెడ్డి, రిటైర్డ్ ఎంఈవో బాబుసింగ్, ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహనుండాలి

తాండూరు రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఐనెల్లి మోడల్ స్కూల్‌లో బాల్య వివాహాలు, పోక్సో చట్టం, మహిళల భద్రత తదితరాంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, సహకరించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆపద సమయాల్లో 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.కార్యక్రమంలోఐనెల్లి రూరల్ సీఐ నగేష్, ఎస్సై విఠల్‌రెడ్డి, షీటీం ఇన్‌చార్జి రోజా, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలమూరు అధ్యయన వేదిక పోస్టర్ ఆవిష్కరణ

బొంరాస్‌పేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న హైదరాబాద్‌లోని దొడ్డి కొమురయ్య హాల్‌లో నిర్వహించే సదస్సు పోస్టర్‌ను గురువారం బొంరాస్‌పేట్‌లో ఆవిష్కరించారు. వేదిక నాయకులు మాట్లాడుతూ'ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శాశ్వత వెనకబాటు' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ పథకంగా ప్రకటించాలన్నారు. రేపటి సదస్సుకు కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక నాయకులు చంద్రశేఖరఖ్, అనిల్, శివరాజ్, కేఎస్పీఎస్ నాయకులు వెంకటయ్య, రామకృష్ణ, మల్లప్ప పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో షూటింగ్ సందడి



ఎల్లమ్మ ఆలయ ఆవరణలో షూటింగ్

వికారాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లి షూటింగ్ స్పాట్‌గా మారుతోంది. గ్రామంలో కొత్తగా నిర్మించిన నాగుల ఎల్లమ్మ ఆలయపరిసరాలు ఆహ్లాదకరంగా ఉండడంతో సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా మారింది. గురువారం ఓ ప్రైవేటు ఆల్బం పాటను చిత్రీకరించారు. గ్రామస్తులు, సమీప గ్రామాల ప్రజలు షూటింగ్ చూసేందుకు తరలివచ్చారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుపొంది పార్టీ సత్తా చాటుదామని కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల తర్వాత ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ జెండా ఎగిరిందని, కష్టకాలంలో పార్టీకి వెన్నంటి ఉన్న కార్యకర్తలకు మండల, మున్సిపల్ ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలని నాయకత్వం నిర్ణయించిందన్నారు. నేడు(శుక్రవారం) నగరంలోని ఎల్బీ స్టేడియంలో జిల్లా, బ్లాక్, మండల, మున్సిపల్ అధ్యక్షులతో జరిగే బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నందున సభ విజయవంతానికి కృషి చేద్దామన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలను దిగ్విజయంగా ముగించుకుందామన్నారు. ఏ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదుల్ల పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, బి.మహిపాల్, కొంగరి విష్ణువర్ధన్‌రెడ్డి, కె.అమృతాసాగర్, బిలకంటి శేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, మండలాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, నర్సింహ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌తో పట్టుబడితే

యాజమాన్యాలపై కేసులు

● **మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి**

మొయినాబాద్ రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): నగర శివారు మొయినాబాద్ ప్రాంతంలో అనేక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలు ఉన్నాయని, వాటిలో చదివే విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వాడినట్లయితే వారితో పాటు విద్యాసంస్థల యాజమాన్యాలపైనా కేసులు నమోదు చేస్తామని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ ఉపయోగిస్తున్నట్లయితే సమాచారమివ్వాలని సూచించారు.

సీఎం, పీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం



సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జంగారెడ్డి

కందుకూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలో మలబార్ గోల్డ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లను పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి ఘనంగా సన్మానించారు. పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ఎస్.కృష్ణానాయక్‌లతో కలిసి ఏనుగు జంగారెడ్డి తుక్కుగూడలో గజమాలతో వారిని సన్మానించారు. మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులున్నారు. కాగా, సీఎం మహేశ్వరం మండలంలో పర్యటించడంతో నాయకులు భారీగా తరలివెళ్లారు.

పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

పూడూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి):పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంఈవో సాయిరెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన వంట సామగ్రిని అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగిందని, అందుకు అనుగుణంగా విద్యాశాఖ కూడా పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు అందజేసిందని తెలిపారు. మధ్యాహ్న భోజనం వండేందుకు వంట సామగ్రిని అందజేశామన్నారు. కార్యక్రమంలో టీచర్లు ఉన్నారు.


వంట సామగ్రి అందజేస్తున్న ఎంఈవో

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి


దోమ: బీఎల్‌వోల శిక్షణకు హాజరైన వికారాబాద్ ఆర్‌డీవో వాసుచంద్ర


కొడంగల్: శిక్షణలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

దోమ/కొడంగల్, జూలై 3(ఆంధ్రజ్యోతి):18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వో) కృషి చేయాలని వికారాబాద్ ఆర్‌డీవో వాసుచంద్ర అన్నారు. గురువారం దోమలోని రైతు వేదికలో ఓటరు నమోదుపై బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. గ్రామాల్లో తిరిగి అర్హతున్నా ఓటు హక్కు లేని వారి పేర్లను తగిన ఆధారాలతో నమోదు చేయాలన్నారు. మృతిచెందిన వారిపేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవిందమ్మ, డీటీ నర్సిములు, ట్రైనర్లు శ్రీనివాస్, రాజేశ్ రాథోడ్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. 18ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. కొడంగల్‌లోని బాలికల పాఠశాలలో బీఎల్‌వోలకిచ్చిన శిక్షణలో మాట్లాడారు. జాబితాల్లో తప్పుల్లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ అనిత, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లు అబ్బుల్‌హక్, క్రాంతికుమార్, రవికుమార్, కొడంగల్ మండల బీఎల్వోలు పాల్గొన్నారు.

నేడు తాండూరులో బీఎల్‌వోలకు శిక్షణ

తాండూరు: తాండూరు మునిసిపాలిటీ, గ్రామీణ మండల బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తామని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. తాండూరు సాయిపూర్‌లోని ప్రభుత్వ నంబర్ పాఠశాలలో ఉదయం 9 నుంచి 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తామని, బీఎల్‌వోలంతా హాజరుకావాలన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం

- ఎల్‌సీ తీసుకోకుండా మరమ్మతులకు పూనుకోగా ప్రమాదం
- మృతదేహంతో కుటుంబీకుల ధర్నా.. ఎల్మకన్నెలో ఘటన


రహీం మృతదేహం


ఫాంహౌస్ వద్ద రహీం కుటుంబీకుల ఆందోళన

తాండూరు రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఓ ఫాంహౌస్‌లో వ్యక్తి కరెంట్ షాక్‌తో మృతి చెందిన సంఘటన ఎల్మకన్నెలో గురువారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గండీడ్ మండలానికి చెందిన గోపాల్‌రాథోడ్ ఎల్మకన్నె సమీప మామిడి తోటలో ఫాంహౌస్‌ను నిర్మించుకున్నాడు. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుకు కరెంటు సరఫరా నిలిచింది. దీంతో గోపాల్ లైన్‌మన్ యాదయ్యకు ఫోన్‌చేశాడు. గంట తర్వాత వస్తానని లైన్‌మన్ చెప్పాడు. గోపాల్ గ్రామంలో చిన్న చిన్న కరెంట్ పనులు చేసే సయ్యద్ రహీం(40) అలియాస్ ముజాయిద్‌ను ఫాంహౌస్‌కు తీసుకొచ్చాడు. రహీం ఎల్సీ తీసుకోకుండానే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులకు చేస్తుండగా 11కేవీ లైన్ తగిలి షాక్‌కొట్టి పడిపోయాడు. వెంటనే గోపాల్, వాచ్‌మన్ నర్సింహులు అతడిని ఆటోలో తాండూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రహీం చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో గోపాల్, వాచ్‌మన్ రహీం కుటుంబీలకు సమాచారమిచ్చారు. మృతుడి కుటుంబీకులు ఆస్పత్రికి చేరుకొని ఆందోళన చేశారు. గొడవ పెద్దది కాగా గోపాల్ పరారయ్యాడు. రహీం మృతదేహాన్ని కుటుంబీకులు ఫాంహౌస్‌కు తీసుకెళ్లి ఆందోళన చేశారు. గ్రామస్తుల చర్చలతో పరిహారానికి గోపాల్ ఒప్పుకున్నాడు. తమకు ఒక ఎకరా భూమి ఇవ్వాలని రహీం కుటుంబీకులు డిమాండ్ చేశారు. మరికొందరు కరన్‌కోట్ స్టేషన్ చేరుకొని ఎస్‌ఐ విఠల్‌రెడ్డికి వివరించారు. గోపాల్‌కు ఎస్‌ఐ ఫోన్‌చేసి పీఎస్‌కు రావాలని కోరారు. గోపాల్ రూ.8లక్షల పరిహారం ఇచ్చేందుకు మధ్యవర్తుల ద్వారా ఒప్పుకున్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై ఇన్‌చార్జి ఏఈ రఘువీరారెడ్డిని స్పందన కోరగా.. ఫాంహౌస్ యజమాని మరమ్మతుల కోసం లైన్‌మన్ యాదయ్యకు ఫోన్ చేసింది వాస్తవమేనన్నారు. లైన్‌మన్ రాకముందే రహీంతో పనులుచేయించడం వల్లే అతడు చనిపోయాడని చెప్పారు. పోస్టుమార్టం ఆధారంగా మృతుడి కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా ఆర్థిక సాయానికి కృషిచేస్తామని చెప్పారు. కాగా మృతుడు రహీంకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం

దుద్యాల, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. గురువారం నాజిఖాన్‌పల్లి పాఠశాల విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. వందేమాతరం ఫౌండేషన్, బలభీమసేన యూట్యూబ్ చానల్ సంయుక్త ఆధ్వర్యంలో పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్లు రాములు, నందిని, మాజీ సర్పంచ్ సాయిలు, సురేందర్‌రెడ్డి, శకనప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీవీవీ నాయకుడు రవీందర్‌గౌడ్

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలి


పూడూరు: దేవనోనిగూడెంలో ఇందిరమ్మ ప్రొసీడింగ్‌ల అందజేత


పరిగిలో ప్రొసీడింగ్ అందజేస్తున్న నాయకులు

కులకచర్ల/పూడూరు/మోమిన్‌పేట్/పరిగి,జూలై 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. గురువారం కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఇంటి నిర్మాణం 400 నుంచి 600 స్క్వేర్ ఫీట్ల మధ్య చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రభూపాల్, షర్ఫొద్దీన్, యాదయ్య, నర్సిములు, కృష్ణ, చంద్రయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు. పూడూరు మండలం దేవనోనిగేడెంలో ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందని మోమిన్‌పేట్ ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. ఎన్కతల, చంద్రయాన్‌పల్లి గ్రామాల్లో ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు నర్సిములు, ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి ఇళ్లకు శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు మల్లేశం, మల్లయ్య, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, ఆనందం పాల్గొన్నారు. నిరుపేదలకు సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.హన్మంత్, ఉపాధ్యక్షుడు అక్బర్ హుస్సేన్, పరిగి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ అన్నారు. పట్టణంలోని ఐదో వార్డులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కావలి సత్యనారాయణ, అయూబ్, ఆనెం అంజనేయులు, చిన్ననర్సింహులు, తావుర్యా పాల్గొన్నారు.

ఏసీబీ గుబులు!

(ఐదో పేజీ తరువాయి)

ముగ్గురు అధికారులు ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే.

జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్లలోనే దందా

ఆర్టీవో కార్యాలయ ఆవరణలో ఉన్న జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్లలోనే అవినీతి బాగోతం జరుగుతుందని అక్కడి నుంచి కొందరూ బ్రోకర్లు అధికారులకు ముడుపులు అందించి వారి పనులు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎప్పుడు సందడిగా కనిపించే ఆ సంటర్లు ఇప్పుడు మూసివేసి కనిపిస్తున్నాయి.

అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి

జిల్లాలో ఏ శాఖలో చూసినా అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతీ పనికి ఇంత అనే దోరణి కొనసాగుతోంది. ప్రస్తుతం అన్ని శాఖల అధికారులను ఏసీబీ కలవర పెడుతోంది. పోలీస్ శాఖను సైతం భయం వీడటం లేదు. దీంతో ముందస్తుగా ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటూ కార్యాలయానికి ఎవరు వస్తున్నారు.. ఎవరు పోతున్నారనే విషయాలను గమనిస్తున్నారు. లావాదేవీలు ఏమైనా ఉన్న బయటే చూసుకోవాలని కార్యాలయంలో ఎలాంటి చర్యలకు పాల్పడకుండా జాగ్రత్త పడుతున్నట్లుగా కింది స్థాయి సిబ్బంది ద్వారా తెలుస్తోంది. పేర్కొంటున్నారు.

నిఘా పెంచాలి

జిల్లాలోని ఓ తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ కార్డుల కోసం దుకాణానికి తెర తీశారు. ఎవరైనా రేషన్ కార్డు అని కార్యాలయానికి వస్తే రూ2,500 చెల్లిస్తే అన్ని వారై రేషన్ కార్డును చేతిలో పెడుతున్నారు. అదే సామాన్యులు ఎవరైనా వెళితే చెప్పులు అరిగేలా తిప్పుతున్నారు. ఆ ఏసీబీ అధికారులు ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఆ మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్, పంచాయతీరాజ్‌తో పాటు ఆయా శాఖల్లో పనికి ఇంత అనే క్రమంలో పనులు జరుగుతుండడంతో ఏసీబీ అధికారులు ప్రభుత్వ అన్ని శాఖలపై ఒక నిఘా పెడుతే బాగుంటుందని భావిస్తున్నారు. కొన్నేళ్లుగా ఆయా శాఖల్లో అధికారుల నుంచి అటెండర్ వరకు ఎవరికి వారు దోచుకుతింటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

9న తాండూరు-గాన్గాపూర్ ఆర్టీసీ స్పెషల్ సర్వీస్


ఆర్టీసీ ప్యాకేజీ టూర్‌లోని ఆలయాలు

తాండూరు, జూలై3(ఆంధ్రజ్యోతి): తాండూరు ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు రెండో టూర్ ప్యాకేజీని ప్రకటించారు. పుణ్యక్షేత్రాలు, దైవ దర్శనాలకు బస్సులను నడుపుతున్నారు. రెండో టూర్ ప్యాకేజీలో భాగంగా తాండూరు నుంచి కర్ణాటక రాష్ట్రం గాన్గాపూర్‌నకు స్పెషల్ సర్వీసును డీఎం నరేష్‌కుమార్ గురువారం ప్రకటించారు. మొదటిది తాండూరు-శ్రీశైలాని, రెండోది తాండూరు-గాన్గాపూర్‌కు టూర్ ప్యాకేజీలని తెలిపారు. ఈ నెల 9న గురుపౌర్ణమి నాడు తాండూరు నుంచి గుల్బర్గా శరణబసవేశ్వర ఆలయం మీదుగా గాన్గాపూర్ దత్తాత్రేయ ఆలయానికి ఈ బస్సు నడుస్తుంది. 9న సాయంత్రం 5గంటలకు బస్సు బయల్దేరుతుంది. తిరిగి మరుసటి రోజు సాయంత్రం 5గంటలకు తాండూరు చేరుతుందని డీఎం చెప్పారు. ఒక్కో ప్రయాణికుడికి టికెట్ రేటు రూ.700గా నిర్ణయించారు. తాండూరు పరిసర ప్రాంతాల భక్తులు ఈ సర్వీస్‌ను వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ నం: 9959226251, 9441717503, 8309348157లలో సంప్రదించాలని డీఎం వివరించారు.

తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన

కీసర, జూలై 3(ఆంధ్రజ్యోతి):దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో తడి, పొడి చెత్త నిర్వహణపై గురువారం అధికారులు అవగహన కల్పించారు. కీసర దాయరలో ఇళ్ల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అధికారులు తెలియజేశారు. ప్రణాళికలో భాగంగా మొక్కలను నాటారు.

కెమిస్ట్రీలో ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కెమిస్ట్రీ విభాగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అనురాగ్‌యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అర్చన మంత్రి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం శక్తి, పర్యావరణంపై నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. వర్క్‌షాప్‌లో దేశ వ్యాప్తంగా 107మంది సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ సవితా బెల్వాల్, కో-కన్వీనర్ గౌరవ్‌సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సాయికృష్ణ బాలభద్ర, రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మరో స్వదేశీ ఉద్యమం చేయాలి

తాండూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో మరో స్వదేశీ ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని విభాగ్ స్వదేశీ జాగరణ మంచ్ కన్వీనర్ టి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరులోని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్వదేశీ వస్తువుల వినియోగం, అవశ్యకతపై అవగాహన కల్పించారు. మన దేశంలో తయారైన వస్తువులన్నీ అమ్ముడైతే ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. చైనా, టర్కీ, అమెరికా దేశాల్లో తయారైన వస్తువులను వాడొద్దని కోరారు.


ప్రసంగిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు


స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

మోమిన్‌పేట్, జూలై 3(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మోమిన్‌పేట్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు 70మంది స్పీకర్ సమక్షంలోకాంగ్రెస్‌లో చేరారు. పేదలకోసం సీఎం రేవంత్‌రెడ్డి పాటుపడుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చంద్రకాంత్, మైపాల్, రాజు, నరేశ్‌కుమార్, ప్రమోద్, ఆనంద్, రాజు, నాగయ్య, ప్రకాశ్, మొగులప్ప, రంజిత్ ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్‌గౌడ్, ఏరాజ్‌పాషా పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన జిల్లా వైద్యాధికారి

వికారాబాద్:వికారాబాద్ జిల్లా నూతన వైద్యాధికారి లలితాదేవి గురువారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్పీకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

413 మంది విద్యార్థినులకు దంత వైద్య పరీక్షలు


బాలికలకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

పరిగి, జూలై3(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని జెకే పనీర్ ఇండియా లిమిటెడ్, శ్రీసాయి డెంటల్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పరిగిలోని బాలికల రెసిడెన్షియల్ స్కూల్/కళాశాల విద్యార్థినులకు దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 413 మంది బాలికలకు చికిత్సలు చేశారు. ఎంఈవో గోపాల్, ప్రిన్సిపాల్ నవనీత మాట్లాడుతూ.. బాలికలకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కంపెనీ మేనేజర్ తిరు, టీచర్ జి.సౌజన్య పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడికి సన్మానం


రాంచందర్‌రావును సత్కరిస్తున్న కౌకుంట్ల చంద్రారెడ్డి, తదితరులు

కీసర రూరల్/పరిగి, జూలై 3(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నియమితుడైన రాంచందర్‌రావును నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛాన్నిచ్చి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాగౌడ్, నాయకులు నాగరాజు, సురేష్, శ్యాంశర్మ, రవీందర్‌రెడ్డి, నరేష్, కొండల్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌వును పరిగి బీజేపీ నాయకులు తార్నాకలోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు, జిల్లా కార్యదర్శి రాంచందర్, పెంటయ్య, కేశవులు, అనసూయ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.


సంక్షిప్తంగా

- **మోమిన్‌పేట్:** వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఏఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మోమిన్‌పేట్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది బలరాం, శంకర్, రవి పాల్గొన్నారు.
- **కులకచర్ల:**ట్యాక్స్ చెల్లించని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని ఆర్టీవో వీరేంద్ర నాయక్ అన్నారు. కులకచర్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ట్యాక్స్ చెల్లించని ఐదు వాహనాలు డీసీఎం, ట్రాక్టర్, టాటా మ్యాజిక్, బులెరో, మరో వాహనాన్ని సీజ్ చేశారు. రూ.1.1లక్షల జరిమానా విధించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అంజనేయులు, సిబ్బంది రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- **కులకచర్ల:**చెల్లాపూర్ పాఠశాలకు బీజేపీ నాయకులు ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని బహూకరించారు. విద్యార్థుల్లో శివాజీ స్ఫూర్తి రావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు అంజిలయ్య, గ్రామస్తులు వెంకటయ్య, నాయకులు గంగాపురం రామకృష్ణ, హెచ్‌ఎం ఆనంద్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.
- **తాండూరు:** తాండూరులోని అయ్యప్ప స్వామి ఆలయానికి హరిహర ఆశ్రమానికి చెందిన గురు స్వాములు రూ.15వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులకు చెక్కు అందజేశారు. గురుస్వాములు రాము, వినోద్‌కుమార్, శ్రీనివాస్‌లు చెక్కు అందజేశారు. అలయ కమిటీ ప్రతినిధులు జైపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.
- **పరిగి:** పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6న స్వామివారికి నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. వారు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతం, కల్యాణం తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ.గోపాల్, సురేఖ, నర్సింలు, వెంకటేష్ పాల్గొన్నారు.
- **బొంరాస్‌పేట్:** బొంరాస్‌పేట్‌లోని ఏటి కాల్వ మరమ్మతులకు రూ.5లక్షలు మంజూరైనట్లు ఎంపీడీవో వెంకన్‌గౌడ్, పీఆర్ డీఈ సుదర్శన్‌రావు, ఏఈ సురేందర్‌రెడ్డి తెలిపారు. కాల్వను పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి ఉన్నారు.
- **కులకచర్ల:** ద్విచక్రవాహనదారులు తమ వాహనాలకు బీమా చెల్లించాలని శ్రీ సత్య ఫైనాన్స్ పరిగి బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. కొత్తాబాద్‌కు చెందిన భాస్కర్ ఈ ఫైనాన్స్‌లో వాహన రుణం ద్వారా తీసుకొని బీమా చేయించాడు. కొద్ది రోజుల అతడు మృతిచెందాడు. దీంతో ఫైనాన్స్ వారు రుణాన్ని మాఫీ చేశారు. కులకచర్లలోని ఫైనాన్స్ కార్యాలయంలో భాస్కర్ కుటుంబీకులకు రుణమాఫీ పత్రాలు, వాహనం పత్రాలను అందించారు. కార్యక్రమంలో క్యాషియర్ రమేశ్, పరిగి బ్రాంచ్ బిజినెస్ మేనేజర్ రాములు, రవికుమార్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.
- **చౌడాపూర్:** ఈ నెల 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. చౌడాపూర్‌లో వారు మాట్లాడుతూ..7న గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి ప్రశాంత్, వివిధ సంఘాల నాయకులు అశోక్, కుమార్, మొగులయ్య, గోవర్ధన్, శివకుమార్, యాదయ్య, అనంతయ్య, హుస్సేన్, సుధీర్ పాల్గొన్నారు.
- **కులకచర్ల:** జీలుగ విత్తనాలు చల్లి మొక్కలు పెరగగానే భూమిలో కలియదున్నితే సహజ పోషకాలు లభించి సారవంతం అవుతుందని ఏవో రామస్వామి సూచించారు. జీలుగ మొక్కలు వరి సాగుకు పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడతాయని తెలిపారు. జూన్, జూలై నెలల్లో చల్లుకొని పూతదశకు వచ్చిన అనంతరం దున్నేస్తే ఫలితాలు బాగుంటాయన్నారు.
- **దౌల్తాబాద్:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బోడి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈర్లపల్లికి చెందిన సాయిలుకు రూ.48వేల చెక్కును అందించారు.
- **కులకచర్ల:** ముజాహిద్‌పూర్‌లో కృష్ణకు రూ.60వేల చెక్కును కాంగ్రెస్ నాయకులు అందించారు. పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి దోహదపడుతుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, శర్ఫోద్దీన్, వెంకటేశ్ పాల్గొన్నారు.
- **దుద్యాల:**మండలంలోని సంద్రకుంట తండా పంచాయతీకి చెందిన సురేశ్‌కు రూ.29 వేలు, రాధాబాయికి రూ.50వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రవి పాల్గొన్నారు.
- **ధారూరు:** కొండాపూర్‌కలాన్‌లో మృతి చెందిన జర్నలిస్టు డి.చంద్రశేఖర్ కుటుంబానికి విలేకరులు ఆర్థికసాయం అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్ జూలై3(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతిచెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గైర్హాన్‌తండాకు చెందిన దశరథ ఆటో నడుపుకుంటూ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలో ఉంటున్నాడు. అతడి మొదటి భార్య కుమారుడు సంతోష్(15) 7వ తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లి చనిపోయింది. దశరథ్.. సౌందర్యను రెండో పెళ్లి చేసుకోగా ఆమెకు ఇద్దరు కొడుకులు. ఈ నెల 2న దశరథ ఆటో తీసుకొని బయటకు వెళ్లాడు. భార్య పిల్లలను పాఠశాలకు పంపి నారాయణ కళాశాలలో హౌస్ కీపింగ్ పనికి వెళ్లింది. సంతోష్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. సాయంత్రం వచ్చి చూడగా సంతోష్ అపస్మారకస్థితిలో బట్టల్లేకుండా పడిఉన్నాడని సౌందర్య దశరథ్‌కు వీడియోకాల్ చేసింది. దశరథ్ వెంటనే అన్నోజిగూడలోనే ఉండే తన బావమరిదికి ఫోన్‌చేసి సంతోష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాలని కోరాడు. అతను మొదట ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పతికి, అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ చికిత్స పొందుతూ గురువారం ఉదయం చనిపోయాడు. తన కొడుకు మృతిపై అనుమానం ఉందని దశరథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మొసలి దాడిలో మేక మృతి


ప్రాజెక్టులో కనిపిస్తున్న మొసలి

మర్పల్లి, జూలై3(ఆంధ్రజ్యోతి):మొసలి దాడిలో మేక మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. కొంశెట్టిపల్లి ప్రాజెక్టులో మొసళ్ల బెడద ఎక్కువైందని, పశువులు, జీవాలపై దాడిచేస్తున్నాయని కాపరులు వాపోయారు. దారులపల్లికి చెందిన పాపయ్య మేకలను అటవీ ప్రాంతానికి వెళ్లాడు. మేకలు ప్రాజెక్టులో నీరు తాగుతుండగా మొసలి ఓ మేకను నీటిలోకి లాక్కెళ్లిందని పాపయ్య వాపోయాడు.

ప్లాట్లలో మట్టి తవ్వకాలు.. పట్టుకున్న స్థానికులు

కీసర, జూలై3(ఆంధ్రజ్యోతి):ఖాళీ ప్లాట్లలో మట్టి తవ్వకాలు చేస్తున్న వ్యక్తులను స్థానికులు పట్టుకున్నారు. చీర్యాల్ పరిధి సర్వే నంబర్ 91, 92, 94లలోని ప్లాట్లలో కొందరు గుట్టుచప్పుడు కాకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ప్లాట్ల యజమానులు బుధవారం రాత్రి మట్టి వాహనాలను అడ్డుకొని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారమిచ్చారు. మూడు లారీలు, ఒక జేసీబీకి అధికారులు జరిమానా విధించారు.

ఏఎంసీ డైరెక్టర్ భగవాన్ కరీం మృతి

- అక్క అంత్యక్రియలకు వెళ్లగా గుండెపోటు


కరీం(ఫైల్)

తాండూరు రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి):తన అక్క అంత్యక్రియలకు వెళ్లిన తాండూరు ఏఎంసీ డైరెక్టర్ భగవాన్ కరీం గుండెపోటుతో మృతిచెందారు. అంతారం అనుబంధ దస్తగిరిపేట్‌కు చెందిన కరీం అక్కడ కర్ణాటకలోని గుల్బర్గాలో మృతిచెందింది. గురువారం కరీం ఆమె అంత్యక్రియలకు వెళ్లి అక్కడే అస్వస్థతకు గురికాగా ఆసుపత్రికి తరలించేలోపు గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహాన్ని దస్తగిరిపేట్ తరలించనున్నారు. ఆయన మృతికి ఏఎంసీ చైర్మన్ బాలరెడ్డి, నాయకులు సంతాపం తెలిపారు.

మేడ్చల్ తహసీల్దార్‌గా భూపాల్



మేడ్చల్ టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ తహసీల్దార్‌గా వి.భూపాల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో మేడ్చల్ జిల్లా బాచుపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్‌లలో విధులు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను రాజకీయ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి సన్మానించారు.

కులకచర్ల ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్‌గా గోపాల్‌సింగ్



కులకచర్ల, జూలై3(ఆంధ్రజ్యోతి):కులకచర్లలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌గా గోపాల్ సింగ్ నియమితులయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం ఎస్బీఐ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి మేనేజర్ వినోద్‌కుమార్ వనస్థలిపురం బ్రాంచ్‌కి వెళ్లారు.

వసతులుంటే విద్యార్థులు బాగా చదువుతారు


మాట్లాడుతున్న ఐక్లీన్ పరిశ్రమ చైర్మన్ గోపి

మేడ్చల్ టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తేనే వారు బాగా చదువుకోగలుగుతారని ఇంటిగ్రేటెడ్ ఐక్లీన్ రూమ్ టెక్నాలజీస్ పరిశ్రమల చైర్మన్ గోపి అన్నారు. గుండ్లపోచంపల్లి పరిధి పాఠశాలల్లో పరిశ్రమ తరఫున రూ.46లక్షలు అందజేశారు. ఈ నిధులతో చేపట్టే పనులను గురువారం గోపి ప్రారంభించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎండీ ఓకేజీం, వైస్‌చైర్మన్ మాధవరావు, బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.